**కథ**

# పూల సంకెళ్లు

సూర్యుడు పశ్చిమ దిశలో బంగారు కాంతులు విరజిమ్ముతున్నాడు.

కొండల క్రిందుగా ప్రవహిస్తున్న నది పసిడిరంగులో మెరిసిపోతోంది. ప్రశాంత్ తన్మయంగా ప్రకృతి అందాలను ఆస్వాదిస్తున్నాడు. బంగారు వన్నెతో తళతళలాడే మబ్బుల చాటునుంచి కొండలలోకి దిగిపోతున్న సూర్యబింబాన్ని చూసినప్పుడల్లా అతనికి ప్రతిమే గుర్తుకొస్తుంది.

ప్రతిమ!

ఆరోజు ఆమే కనుక తనకా ఉపకారాన్ని చేసి ఉండకపోతే ఈసరికి తను ఎక్కడుంటేవాడు? నిరుద్యోగిగా రోడ్లను సర్వే చేస్తూ కలలనూ, కోర్కెలనూ గుండెల్లోనే అణచిపెట్టి కన్నీటితోనే ఆకలి తీర్చుకుంటూ అసమర్థుడిగా సమాజం హేళనలను భరిస్తూ ...అబ్బ! ఎంత నరకం అనుభవిస్తూ ఉండేవాడు!

కానీ ఇప్పుడో...తానొక బాధ్యతగల పోలీస్ ఆఫీసర్. సంఘవిద్రోహుల గుండెల్లో సింహస్వప్నం. ఇదంతా ప్రతిమ పెట్టిన భిక్షకాదూ!

గతం మరోసారి కళ్లముందు నిలిచింది.

ఆరోజు తనకు బాగా గుర్తు. ఎన్ని ఇంటర్వ్యూలకు వెళ్లినా సెలెక్ట్‌కాక నిరాశతో కృంగిపోతున్న సమయంలో వచ్చిన ఇంటర్వ్యూకార్డ్ పెన్నిధిలా కనిపించింది. అంతకు నెలక్రితం వ్రాసిన వ్రాతపరీక్షలో తను సెలెక్టయ్యాడు. ఇప్పుడు కేవలం నామమాత్రపు పరీక్ష. తనకు ఉద్యోగం వచ్చేసినట్టే.

ఆ శుభవార్తను పల్లెలోవున్న తాతగారికి చెప్పాలన్న ఉబలాటంతో వెంటనే ప్రయాణం అయ్యాడు.

''జాగ్రత్తగా వెళ్లిరా బాబూ!'' అంది అమ్మ.

''అన్నయ్యా! నీ మొదటి జీతంతో నాకు పాలిస్టర్ చీర కొనాలి'' అంది చెల్లాయి ప్రత్యూష.

''పాలిస్టర్ చీరేం ఖర్మ. పట్టుచీరే కొంటాన్లే'' అన్నాడు తను.

''ఈ బాక్స్ పట్టుకెళ్లు. తాతగారికి లడ్డూలు కట్టాను. అవునూ ఈ సర్టిఫికెట్స్ అన్నీ అక్కడికెందుకురా?'' అది అమ్మ పెట్టెసర్దుతూ.

''ఉండనీ అమ్మా. అన్నీ తాతగారికి చూపించాలి'' అన్నాడు ఫైల్‌ని పెట్టె అడుగున పెడుతూ.

''ఇదిగో ఈ రెండొందలు అమ్మమ్మకివ్వు.''

''ఎక్కడివమ్మా?'' ఆశ్చర్యంగా అడిగాడు.

''ఎక్కడివేమిట్రా! పండగ సీజన్‌కదా! బట్టలు కుడితే వచ్చినవే'' అంది అమ్మ నవ్వుతూ.

తను అమ్మకేసి బాధగా చూసాడు. అలసిన కళ్లకింద నల్లటి చారలు. నలభై ఏళ్లకే అరవై ఏళ్లదానిలా కనిపిస్తోంది.

తనకు కన్నీళ్లు గిర్రున తిరిగినై. ప్రేమగా తన తల నిమిరింది.

''పిచ్చినాన్నా! ఎందుకురా బాధ పడతావ్? ఇంకెంత! ఒక నెల రెండునెలలు. తర్వాత నీ జీతం రాదూ! అప్పుడు కాలిమీద కాలు వేసుకుని దర్జాగా పనిమనిషి చేత చేయించుకుంటాను.''

''పనిమనిషికేం ఖర్మమ్మా! వదినరాదూ'' అంది ప్రత్యూష కొంటెగా తనకేసి చూసి.

''ఏయ్ మొద్దూ! ముందు నిన్ను పంపించెకే వదినొస్తుంది'' అన్నాడు తను ప్రత్యూష చెవి మెలిపెట్టి.

''అమ్మా! అన్నయ్య చూడు. నన్నిక్కడినుంచి పంపించేస్తాడుట'' అంది ప్రత్యూష ఏడుపు ముఖం పెడుతూ.

''అవునమ్మా ఉషా. ఆడపిల్లవు కదా మరి. నిన్నో అయ్య చేతిలో పెట్టాకే అన్నయ్య పెళ్లి'' అంది అమ్మ నవ్వుతూ.

విషయం అర్థమయ్యాక ప్రత్యూష ముఖం సిగ్గుతో ఎర్రబడిపోయింది. ఓరగా తనకేసి చూసింది.

నాలుక బైటపెట్టి వెక్కిరించాడు తను. ఎంతో ఆనందంగా పల్లెకు బయలుదేరిన తన సంతోషం అట్టేసేపు నిలబడలేదు. అందుకు కారణం తన సూట్‌కేస్ పోయింది. పల్లెకు వెళ్లకుండానే తిరిగి వచ్చేసాడు.

''కాబోయే పోలీస్ ఆఫీసర్‌గారి సూట్‌కేసు పోయింది. భలే భలే...'' అంది ప్రత్యూష చప్పట్లు కొడుతూ.

''అబ్బ ఉండవే. అన్నయ్య అసలే బాధపడుతుంటే'' అంది అమ్మ చెల్లాయిని మందలిస్తూ.

''అమ్మా! నా సర్టిఫికెట్స్ కూడా పోయాయి'' అన్నాడు తను కన్నీటిని ఆపుకోవడానికి విఫలయత్నం చేస్తూ.

''అంటే...ఇంటర్వ్యూ కార్డుకూడా పోయిందా?''

''అవునమ్మా. ఉద్యోగం రానట్టే'' అన్నాడు చేతులతో ముఖాన్ని కప్పుకుని.

''పోలీస్ రిపోర్టు ఇవ్వు బాబూ! లేకపోతే పత్రికలో ప్రకటన వేయించు'' అంది అమ్మ.

''లాభం లేదమ్మా. దొరికేసరికి పుణ్యకాలంకాస్తా దాటిపోతుంది. ఇంటర్వ్యూకి అయితే హాజరు కావచ్చు. కానీ సర్టిఫికెట్లు చూపించాలికదా'' నిరాశగా అన్నాడు తను.

అందరూ ఉద్యోగం మీద ఆశలు వదిలేసుకున్నారు. జాయినవడానికి ఇక రెండురోజులే టైముంది.

సరిగ్గా అప్పుడొచ్చింది బరువైన రిజిస్టర్ కవరు. సంతకం చేసి కవరు తీసుకుని విప్పి చూసాడు. పోయాయనుకున్న తన సర్టిఫికెట్స్ అన్నీ భద్రంగా ఉన్నాయి అందులో. వాటితోపాటు ఓ కాగితం మడత.

ఆత్రంగా విప్పాడు దాన్ని.

ప్రశాంత్‌గారూ!

నన్ను క్షమించండి. ఆరోజు మీరెక్కిన బస్సులోనే నేనూ ఎక్కాను. మీరు నన్ను గమనించలేదేమోగానీ నేను ముందునుంచీ మిమ్మల్ని కనిపెడుతూనే ఉన్నాను. మీరేమిటో కలల ప్రపంచంలో తేలిపోతూ ఇతర విషయాలు పట్టించుకున్నట్టు కనిపించలేదు. అందుకనే మీ సూట్‌కేస్ కొట్టెయ్యాలని ముందుగానే నిర్ణయించుకున్నాను. క్షమించండి అది నా వృత్తి.

సరే! మీరు ఆ పల్లెలో సూట్‌కేస్ మరచిపోయి దిగేశారు. దాన్ని కాజేయాల్సిన దురవస్థ తప్పినందుకు సంతోషిస్తూ మీరు ఖాళీ చేసిన సీట్లో కూర్చున్నాను. మీ సూట్‌కేస్‌ని నా స్వంతం చేసుకున్నానని వేరే చెప్పాల్సిన అవసరం లేదనుకుంటాను.

ఇంటిదగ్గర దాన్ని తెరచిన నాకు అడుగున మీ ఫైల్ కనిపించింది. అవేమిటో ఇంటర్ చదువుతున్న నా తమ్ముడు చెప్పాడు.

నేను మీ ఉద్యోగాన్ని పోగొడుతున్నాను. నిరాశతో కృంగిపోయే నా తల్లి ముఖంలో మీ అమ్మగారు కనిపించారు. అమాయకమైన మా తమ్ముడి వదనంలో మీ చెల్లాయి కనిపించింది. ఇవన్నీ నాకెలా తెలిసాయంటారేమో మీ డైరీ చదివాను. అందుకు కూడా నన్ను క్షమించండి. ఆ వెంటనే మీ సర్టిఫికెట్స్ మీకు పోస్టు చేసాను. ఉద్యోగంలో చేరాక ఎప్పుడైనా నన్ను గుర్తుకు తెచ్చుకోండి.

ఇక ఉంటా

ప్రతిమ

ఆశ్చర్యంతో ఆ ఉత్తరంకేసి చూస్తున్న నా చేతిలోనుంచి దాన్ని లాక్కుని బయటకు చదివింది ప్రత్యూష.

''ఆ అమ్మాయి ఎవరోగానీ మనిషి కాదురా, దేవత!'' అంది అమ్మ.

ఆ మాటలు నిజమే అనిపించింది తనకి. తన కృతజ్ఞతలు తెలుపుకుంటూ జవాబు వ్రాయాలనిపించింది. కానీ ఎక్కడా అడ్రస్ లేకుండా జాగ్రత్తపడింది ప్రతిమ. ఆమె రూపాన్ని గుర్తుకు తెచ్చుకోవాలని ప్రయత్నించాడు తను. ఆరోజు తన సీట్లో కూర్చుని మాటిమాటికీ వెనుదిరి చూసే ఆ అమ్మాయే ప్రతిమ అయివుంటుంది. పచ్చగా మెరిసిపోతూ పసిడివన్నెని సంతరించుకున్న పశ్చిమాకాశంలా, బంగారు కంకులతో తళుకులీనే పంటచేనులా ఎంత అందంగా వుంది?

ఆరోజునుంచి పశ్చిమాకాశాన్ని చూసినప్పుడల్లా ప్రతిమే గుర్తుకొస్తుంది తనకు.

★★★

రైలు వస్తున్నట్లు ఎనౌన్స్ చేసారు. ప్లాట్‌ఫామ్ మీద సందడి మొదలైంది. భుజానికున్న బ్యాగ్‌ని సరిచేసుకుని ట్రెన్‌కేసి నడిచాడు ప్రశాంత్. తన కంపార్ట్‌మెంట్ వెదుక్కుని ఎక్కాడు. నెంబరు చూసుకున్నాడు. తన బెర్తు పైనుంది.

అప్పటికింకా సాయం సమయమే కావడంవల్ల అందరూ క్రింద సీట్లలోనే ఉన్నారు. ప్రశాంత్ కిటికీ ప్రక్కగావున్న సీట్లో కూర్చున్నాడు. రైలు కూత పెట్టింది. కదిలే సమయానికి ఆదరా బాదరగా ఎక్కిందో అమ్మాయి. ఇరవై ఉండవచ్చు వయస్సు. ప్రశాంత్ ఎదురుగా ఉన్న సీట్లో కూర్చుంది. ఎందుకనో మాటిమాటికీ తలుపుకేసి చూస్తోంది.

రైలు కదిలాక నిశ్చింతగా ఊపిరి తీసుకుంది.

బహుశా టిక్కెట్ కొనని రకమేమో! తన ఊహకి తనే నవ్వుకున్నాడు ప్రశాంత్. పరిశీలనగా ఆమెకేసే చూస్తున్నాడు. ఎక్కడో ఎప్పుడో చూసినట్టు గుర్తు.

ఒక్కొక్కరినీ చెక్ చేస్తూతనదగ్గరకి వచ్చిన టీసీని చూసి ఆమె బెదిరిపోయింది.

''మేడమ్! టిక్కెట్ ప్లీజ్''

ఆమె కంగారుగా బ్యాగ్ ఓపెన్ చేసింది.

''సారీ టిక్కెట్ పోయింది'' అంది మెల్లగా.

''ఎలా పోయింది?''

''ఏమో!''

''అయినా పర్లేదు. పెనాల్టీతో కట్టండి''

''నాదగ్గర డబ్బులేదు.''

రైలాగింది ఏదో స్టేషన్‌లో.

టిసి ఆమెను రెక్కపట్టుకుని లేపాడు. ప్రశాంత్ పక్కనున్న యువకుడు టిసిని వారించాడు.

''ఆమె కట్టాల్సిన డబ్బు నేనిస్తాను. ఆమెను వదలండి'' అంటూ పర్సు తెరిచాడు. డబ్బు తీసుకుని టిసి వెళ్లిపోయాడు.

''థాంక్సండీ'' అందా అమ్మాయి.

''ఫర్వాలేదు. మీ పేరు?''

''ప్రతిమ!'' చెప్పిందామె.

ప్రశాంత్ ఉలిక్కిపడ్డాడు. అవును. ఇప్పుడు గుర్తుకువచ్చింది. ఆమె ప్రతిమ. తన కలల చెలి. తనకో దారి చూపిన దేవత.

ఆ యువకుడు నవ్వి నిద్రకు ఉపక్రమించాడు. అటు తిరిగి డిన్నర్ తీసుకున్నాడు ప్రశాంత్. తరువాత పైబెర్తు ఎక్కి నిద్ర నటించసాగాడు.

పూర్‌గాళ్. ఎన్నాళ్లిలా చట్టానికి దొరక్కుండా తప్పించుకుంటుంది. ఒకవేళ పట్టుబడితే పువ్వులాంటి ఆమె జీవితం వాడి, రేకులు రాలిపోతుంది. ఆమెమీదే ఆధారపడి బ్రతుకుతున్న ఆమె తల్లీ, తమ్ముడు రోడ్డున పడతారు. ఆమె కనుక తనకు ఉపకారం చేయకపోతే తాము ఏమయ్యేవారు?

ఆమె కనుక కష్టాల్లో పడితే ఆ పాపం తనదే అవుతుంది. తను ఆమెకు ప్రత్యుపకారం చేయాలి. ఎలా...ఏ విధంగా?

ప్రశాంత్ ఒక నిర్ణయానికి వచ్చేసాడు.

★★★

''ఎవరు మీరు? నన్నొదిలేయండి. మీకు దండం పెడతా'' అంది ప్రతిమ, తన చేతిని గట్టిగా పట్టుకున్న ప్రశాంత్ నుంచి విడిపించుకోవడానికి ప్రయత్నిస్తూ.

''ఆగండి ప్రతిమ. నేను చెప్పేది వినండి'' అన్నాడు ప్రశాంత్.

ప్రతిమ ఆశ్చర్యంతో అతని ముఖంకేసి చూసింది.

''ఎవరితను? తనను పేరుపెట్టి మరీ పిలుస్తున్నాడు. ఇతడికి తన పేరు ఎలా తెల్సింది? తన ఆలోచనలకు తనే నవ్వుకుంది ప్రతిమ. రైల్లో తన ప్రక్క యువకుడికి తను పేరు చెప్పింది కదూ. అప్పుడు వినివుంటాడు.

''నా పేరు ప్రశాంత్'' తాపీగా అన్నాడు ప్రశాంత్.

ఒక్కసారిగా ఉలిక్కిపడింది ప్రతిమ.

''అంటే మీరు పోలీస్ ఇనస్పెక్టర్ ప్రశాంత్‌గారా?''


''అవును'' హుందాగా అన్నాడు.

ప్రతిమ ఏడవడం మొదలుపెట్టింది. తన చేతిలోని సూట్‌కేస్‌ని సిమెంట్ బెంచీమీద పెట్టేసింది.

''ఇదిగో. ఇది తీసుకుని రైల్లో ఆయనకు ఇచ్చేయండి.''

''దయచేసి నన్నొదిలేయండి. ఇంకెప్పుడూ ఇలాంటి పని చేయను.''

''వదలను'' గంభీరంగా అన్నాడు ప్రశాంత్.



''వదలకండి. ఇప్పుడే జైల్లో పెట్టించి మీవాళ్లచేత లాఠీ దెబ్బలు తగిలించండి. లేకపోతే ఆ పని మీరే చెయ్యండి. మీకు చేసిన ఉపకారానికి అలా బదులు తీర్చుకోండి. అరెస్టు చేయండి ఇప్పుడే'' అంది ప్రతిమ. దుఃఖంతో ఆమె కంఠం వణుకుతోంది.

''ఊరుకో ప్రతిమా! నా దేవతకు అలాంటి శిక్ష ఎందుకు వేస్తాను?'' అంటూ మృదువుగా ఆమె ముఖాన్ని పైకెత్తాడు.

తడిసిన ఆ విశాలనేత్రాలు మంచులో తడిసిన కలువరేకుల్లా రెపరెపలాడుతున్నాయి.

''అయితే నాలాంటి నేరస్థురాలిని వదిలేస్తారా? అలాచేస్తే మీ ఉద్యోగ ధర్మానికి భంగంకదూ?''

''వదిలేస్తానని నేను అనలేదే?'' అంటూ నవ్వాడు ప్రశాంత్.

''మరి?'' ప్రతిమ అర్థం కానట్టు చూసింది.

''నా దృష్టిలో దండన ద్వారా నేరస్థుల్ని మార్చగలమనే అభిప్రాయానికి విలువలేదు, అందులోనూ నీవంటి కన్నె కుసుమాలని. ఈ సమాజంలో నేరస్థుల్ని మార్చాలంటే వాళ్లకు ఇవ్వాల్సింది సానుభూతి, చేయూత. వాళ్లనలా మార్చిన పరిస్థితులకు చికిత్స. అప్పుడే వాళ్లల్లో పరివర్తన వస్తుంది'' ఉపన్యాస ధోరణిలో చెప్పాడు ప్రశాంత్.

''అయితే నా విషయంలో మీరేం చేద్దామనుకుంటున్నారు? వదిలేస్తారా?''

''వదలను. అసలా ఉద్దేశ్యమే నాకు లేదు.''

''ఏం చేస్తారు మరి?''

''ఏం చేస్తానా? సంకెళ్లు వేసి బంధిస్తాను.''

''వెయ్యండి. ఆ మాట నేను ముందే చెప్పాను కదా'' అంటూ రెండు చేతుల్ని ముందుకు చాచింది ప్రతిమ.

ఆ చేతుల్ని పెదాలకానించుకుని ముద్దుపెట్టుకున్నాడు ప్రశాంత్.

''ప్రతిమా! నేనూ ముందే చెప్పానుకదా! నీవంటి దేవతకు వెయ్యవలసినవి ఇనుప సంకెళ్లు కావు. పూల సంకెళ్లు. వాటితోనే నిన్ను బంధించి శాశ్వతంగా నా హృదయంలో దాచుకుంటాను'' అంటూ ఆమె నడుం చుట్టూ చేతులు వేసి దగ్గరగా లాక్కున్నాడు.

మధురమైన సంగీతం వింటున్నట్లు ప్రశాంత్ మాటల్ని వింటూ అతని చేతుల్లో ఒదిగిపోయింది ప్రతిమ. ★

**వీటూరి భాస్కరమ్మ**